క్లుప్తంగా

అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయం

కోనేరుసెంటర్: రాష్ట్రాభివృద్ధి, అన్నివర్గాల సంక్షేమమే ధ్యేయంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పాలన చేస్తున్నారని వైఎస్సార్ సీపీ యువజన విభాగం జోనల్ ఇన్‌చార్జి పేర్ని కిట్టు అన్నారు. పెదయాదర గ్రామంలో బుధవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ప్రభుత్వ పథకాలు వివరించి స్థానికుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. గ్రామ ఇన్‌చార్జి అర్జా శంకర్, మాజీ సర్పంచ్ కంచర్లపల్లి విజయసారథి, రాజారావు, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

విద్యార్థుల ర్యాలీ

మచిలీపట్నంటౌన్: ప్రపంచ పేపర్ బ్యాగ్ దినోత్సవాన్ని నగరంలోని నెల్లూరు రవీంద్ర భారతి హైస్కూల్‌లో బుధవారం నిర్వహించారు. పర్యావరణానికి హాని కలిగించే ప్లాస్టిక్ క్యారీ బ్యాగ్‌లను, ప్లాస్టిక్ వస్తువుల వాడకాన్ని విడనాడి ప్రతి ఒక్కరూ పేపర్ బ్యాగ్‌లు వినియోగించాలని కోరుతూ విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. పదో డివిజన్ కార్పొరేటర్ షేక్ ముంతాజ్‌బేగం, డీన్ శ్రీకాంత్, ప్రిన్సిపాల్ సీతామహాలక్ష్మి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో పూర్ణాహుతి

మోపిదేవి: స్థానిక వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారి ఆషాఢ కృత్తిక మహోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఆలయ ఏసీ ఎస్ఎస్ చక్రధరరావు ఆధ్వర్యంలో ఆలయ ప్రధాన అర్చకులు బుద్దు పవన్‌కుమార్ శర్మ బ్రహ్మత్వంలో ఆలయ వేద పండితులు కొమ్మూరి ఫణికుమార్ శర్మ నేతృత్వంలో బుధవారం స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో స్వామి వారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

ముగిసిన శిక్షణ తరగతులు

కోనేరుసెంటర్: నేషనల్ ఫిషరీస్ డెవలప్‌మెంట్ బోర్డు ఆధ్వర్యంలో తాళ్లపాలెంలో మత్స్యకారులకు నిర్వహించిన మూడు రోజుల శిక్షణ తరగతులు బుధవారంతో ముగిశాయి. శిక్షణలో 50 మంది మత్స్యకారులు, మత్స్య శాఖాధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

18 మందికి నేత్ర వైద్య పరీక్షలు

మచిలీపట్నంటౌన్: రిటైర్డ్ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో బుధవారం స్థానిక సంఘ భవనంలో ఉచిత నేత్ర, దంత వైద్య శిబిరాలు నిర్వహించారు. రాజమండ్రికి చెందిన గౌతమి నేత్రాలయం ఆధ్వర్యంలో 18 మందికి వైద్యుడు తిరుపతి కంటి పరీక్షలు నిర్వహించారు. వీరిలో ఒకరికి శస్త్ర చికిత్స అవసరమని గుర్తించారు. విజయవాడకు చెందిన దుహిత డెంటల్ కేర్ ఆస్పత్రి వైద్యురాలు కె. సుభద్ర 15 మంది రోగులకు దంత వైద్య పరీక్షలు నిర్వహించారు.

గ్రామాభివృద్ధికి విరాళం

చల్లపల్లి: గ్రామంలో స్వచ్ఛ సుందర చల్లపల్లి కార్యక్రమ నిర్వహణకు విశ్రాంత పీఈటీ దాసరి రామ్మోహనరావు రూ.లక్ష విరాళాన్ని అందజేశారు. బుధవారం స్థానిక కమ్యూనిస్టు బజారులో విరాళం చెక్‌ను రామ్మోహనరావు స్వచ్ఛ చల్లపల్లి కన్వీనర్ డాక్టర్ డీఆర్కే ప్రసాద్, విశ్రాంత ప్రిన్సిపాల్ ఎస్.రామారావుకు అందజేశారు.

మద్యం కేసులో నలుగురి అరెస్ట్

చల్లపల్లి: చల్లపల్లి, లక్ష్మీపురం, మంగళాపురం, కొత్తమాజేరు గ్రామాల్లో మద్యం విక్రయిస్తున్న నలుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. మద్యం బాటిళ్లను సీజ్ చేసి నిందితులను మొవ్వ జేఎఫ్‌సీఎం కోర్టుకు హాజరుపర్చగా మేజిస్ట్రేట్ రిమాండ్ విధించారు.

కన్న బిడ్డల కంటే ఎక్కువ సేవలు

- కరోనా సమయంలో అమూల్య సేవలు
- ప్రతి నెలా ఒకటో తేదీనే సామాజిక పెన్షన్ల పంపిణీ
- నాలుగేళ్లుగా ప్రజల మన్ననలు అందుకుంటున్న వలంటీర్లు

గూడూరు: ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధులుగా పనిచేస్తూ వలంటీర్లు అందరి మన్ననలు పొందుతున్నారు. కరోనా క్లిష్ట సమయంలో కుటుంబ సభ్యులు సైతం దూరంగా ఉండగా ప్రాణాలకు తెగించి వలంటీర్లు సేవలు అందించారు. నామమాత్రపు పారితోషికంతో పనిచేస్తూ వెలకట్టలేని సేవలు అందిస్తున్నారు. ప్రతి నెలా ఒకటో తేదీన కోడి కూయక ముందే ఇంటి తలుపు తట్టి టంఛనుగా అవ్వాతాతలకు, దివ్యాంగులకు సామాజిక పెన్షన్లు అందిస్తూ సమాజంలో తమకంటూ ప్రత్యేక గుర్తింపు పొందుతున్నారు. కుటుంబంలో ఒక భాగంగా మారిపోయిన వలంటీర్లపై చంద్రబాబు, జనసేన అధినేత పవన్ కల్యాణ్ అనుచిత వ్యాఖ్యలు చేయడం సరికాదని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

మాకు అండగా నిలిచారు



నా పేరు నక్కిన భద్రకాళి, మాది గూడూరు మండలం పోలవరం గ్రామం. కరోనా సమయంలో నా భర్తకు పాజిటివ్‌గా నిర్ధారణ అయింది. మా ఇంటికి ఎవరినీ రానివ్వలేదు. ఇంట్లో ఉన్న మా అత్తమామలు, పిల్లలను కూడా ఇంటికి రానివ్వకుండా మాకు దూరం పెట్టారు. అలాంటి సమయంలో మాకు అండగా నిలబడింది వలంటీర్లు మాత్రమే. ప్రతి రోజూ మాకు కావాల్సిన మందు బిళ్లలు, పాలు, కూరగాయలు, నిత్యావసర వస్తువులు సరఫరా చేస్తూ ఏ లోటూ రానివ్వకుండా చూసుకున్నారు. తమ ప్రాణాలను ఫణంగా పెట్టి మా పట్ల మానవత్వంతో వ్యవహరించిన వలంటీర్లపై అనుచిత వ్యాఖ్యలు చేయడం బాధాకరం.

వలంటీర్ల సేవలు అసమానం



నా పేరు పిచ్చుక లీలా వెంకటేశ్వరరావు, నేత పని చేసుకుంటూ జీవిస్తున్నా. హైదరాబాద్‌లో ఉండే మా అబ్బాయి ఇంటికి వచ్చిన సమయంలో కరోనా పాజిటివ్‌గా నిర్ధారణ అయింది. మండలంలోనే మొదటి కేసుగా నమోదైంది. మా ప్రాంతంలో బారికేడ్లు ఏర్పాటు చేసి రెడ్ జోన్‌గా ప్రకటించారు. దాదాపు రెండున్నర నెలలు మా ఇంటి పరిసరాల్లోకి ఎవరినీ రానివ్వలేదు. అలాంటి సమయంలో మేమున్నామంటూ భరోసా ఇచ్చింది మా వలంటీరే. నిత్యం ఇంటికి వచ్చి మాకు కావాల్సినవి సమకూర్చడమే కాకుండా మా బాగోగులు అడిగి తెలుసుకున్నారు. వలంటీర్ల సేవలకు హ్యాట్సాఫ్. అలాంటి వ్యవస్థపై ప్రతిపక్షాలు విమర్శలు చేయడం సరికాదు.



కరోనా సమయంలో బాధితుల బాగోగులు అడిగి తెలుసుకుంటున్న వలంటీర్ (ఫైల్)



కరోనా సమయంలో పోలవరంలో ఇంటికే సరుకులు తీసుకువచ్చి అందజేస్తున్న వలంటీర్ (ఫైల్)

వలంటీర్ల అండతో ఏ లోటూ రాలేదు



గతంలో వృద్ధాప్య పెన్షన్ తీసుకోవాలంటే పంచాయతీ ఆఫీసుకు కాళ్లు ఈడ్చుకుంటూ వెళ్లి గంటల తరబడి నిరీక్షించాల్సి వచ్చేది. ఇప్పుడు ఆ అవసరం లేకుండా ప్రతి నెలా మొదటి రోజే సూర్యోదయం కాకమునుపే తలుపు తట్టి వలంటీర్లు టంఛనుగా పెన్షన్ ఇచ్చి వెళ్తున్నారు. పెద్దమ్మా ఎలా ఉన్నావంటూ ఆప్యాయంగా యోగక్షేమాలు అడుగుతున్నారు. ఏమైనా పని ఉందంటే వారే చేసి పెడుతున్నారు. ఈ వయస్సులో వలంటీర్లు ఉండగా మాకు ఎలాంటి ఇబ్బంది లేదు. మంచి వ్యవస్థను ఏర్పాటుచేసిన సీఎం జగన్‌కు కృతజ్ఞతలు. ఈ వ్యవస్థపై ప్రతిపక్షాలు విమర్శలు మానుకోవాలి.

–నాపేరు ముప్పల శారద. మాది పోలవరం గ్రామం.

పథకాలపై అవగాహన కల్పించారు



గతంలో ప్రభుత్వ సంక్షేమ పథకాల ద్వారా లబ్ధి పొందాలంటే ఎవరిని సంప్రదించాలో తెలిసేది కాదు. దరఖాస్తు చేసుకోవడానికి కాళ్లరిగేలా కార్యాలయాల చుట్టూ తిరగాల్సి వచ్చేది. ఇప్పుడు వలంటీర్లే ప్రతి ఇంటింటికీ వచ్చి అవగాహన కల్పించి దరఖాస్తు చేయిస్తున్నారు. తద్వారా పథకాల లబ్ధి అందుతోంది. అలాంటి వలంటీర్ల వ్యవస్థను రాజకీయం చేయడానికి కొంత మంది నేతలు ప్రయత్నించడం బాధాకరం. నిస్వార్థంగా సేవలు అందిస్తున్న వలంటీర్లను అభినందించాల్సిందే.

– యర్రా శ్యాంసుందర్ విఠల్, పోలవరం గ్రామం

రాజకీయ లబ్ధి కోసమే విమర్శలు



కేవలం రాజకీయ లబ్ధి కోసమే జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్ వలంటీర్లపై విమర్శలు చేస్తున్నారు. వలంటీర్లు అందిస్తున్న సేవలను గుర్తించకపోయినా పరవాలేదు. కానీ, వారి మనోభావాలు దెబ్బతినేలా ఆరోపణలు చేయడం శోచనీయం. ప్రతి నెలా అవ్వాతాతలకు పెన్షన్లు అందించడంలో గానీ, ప్రభుత్వ పథకాలపై ప్రజల్లో చైతన్యం తీసుకురావడంలో గానీ, కరోనా వంటి విపత్కర పరిస్థితుల్లో కూడా ప్రజలకు వలంటీర్లు అందించిన సేవలు యావత్ దేశం జేజేలు పలికింది. వలంటీర్లపై అనుచిత వ్యాఖ్యలు చేసిన పవన్ కల్యాణ్ క్షమాపణలు చెబితే ఆయన గౌరవం పెరుగుతుంది.

– పిచ్చుక గంగాధరరావు, పోలవరం గ్రామం

పాడి పరిశ్రమ అభివృద్ధికి తోడ్పాటు

పెదన ఏఎంసీ చైర్‌పర్సన్ చారుమతి

పెడన: పాడి పరిశ్రమ అభివృద్ధికి ప్రభుత్వం తోడ్పాటు అందిస్తోందని, దానిని రైతులు సద్వినియోగం చేసుకోవాలని పెడన వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ గరికిపాటి చారుమతి అన్నారు. పశుగణాభివృద్ధి సంస్థ గన్నవరం వారి ఆధ్వర్యంలో మండలంలోని పెనుమల్లి గ్రామంలో బుధవారం లేగదూడల ప్రదర్శన (అందాల పోటీలు) నిర్వహించారు. ప్రథమ బహుమతిని ఉయ్యూరు శివప్రసాద్ (పెనుమల్లి), ద్వితీయ బహుమతిని ఊసా భాస్కరరావు (నేలకొండపల్లి), తృతీయ బహుమతిని ఊసా లక్ష్మణస్వామి (నేలకొండపల్లి) లేగ దూడలు కైవసం చేసుకున్నాయి. పోటీల్లో పాల్గొన్న అందరికి ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. పశుగణాభివృద్ధి సంస్థ గన్నవరం డీడీ కె. శ్రీనివాసరావు, డాక్టర్ వై. హరిత, పశుసంవర్ధక శాఖ మచిలీపట్నం ఇన్‌చార్జి డీఈ జేవీ రమణయ్య, పెడన ఏడీ కొనకళ్ల బాబూరావు తదితరులు పాల్గొన్నారు.

అందరికీ సంక్షేమమే లక్ష్యం

ఎమ్మెల్యే సింహాద్రి



అవనిగడ్డలో సర్టిఫికెట్లు అందిస్తున్న ఎమ్మెల్యే సింహాద్రి

అవనిగడ్డ: అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందించాలన్నదే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమని అవనిగడ్డ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు అన్నారు. స్థానిక పంచాయతీ పరిధిలోని మూడో సచివాలయంలో మంగళవారం జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా 1,046 మందికి ఎమ్మెల్యే సింహాద్రి పలు రకాల సర్టిఫికెట్లను అందించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ గతంలో సర్టిఫికెట్లు కావాలంటే కార్యాలయాల చుట్టూ తిరగాల్సి వచ్చేదని, నేడు జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా ఆయా గ్రామాల్లోనే అందిస్తున్నారని వివరించారు. ఎంపీపీ తుంగల సుమతీదేవి, జెడ్పీటీసీ చింతలపూడి లక్ష్మీనారాయణ, ఎంపీడీఓ శైలజ, తహసీల్దార్ రామకృష్ణ, నాయకులు, ఎంపీటీసీలు, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

నడుపూరులో..

పెడన: నడుపూరు గ్రామ సచివాలయం వద్ద జగనన్న సురక్ష శిబిరం నిర్వహించారు. 291 మందికి ధ్రువీకరణ పత్రాలను అందజేశారు. ఎంపీపీ రాజులపాటి వాణి, మాజీ ఎంపీపీ అచ్యుతరావు, వ్యవసాయ సలహా సంఘం పెడన చైర్మన్ కాగిత వెంకటేశ్వరరావు, సర్పంచ్ చీర్ల అనూష, తహసీల్దార్ మధుసూదనరావు, ఎంపీడీఓ రెడ్డయ్య, ఈఓపీఆర్డీ జయరాము పాల్గొన్నారు. పట్టణంలోని ఆరో సచివాలయం పరిధిలో మున్సిపల్ కార్యాలయం వద్ద జరిగిన శిబిరంలో 276 ధ్రువీకరణ పత్రాలను అందజేశారు. మున్సిపల్ ఇన్‌చార్జి చైర్మన్ ఎండీ ఖాజా, వార్డు కౌన్సిలర్ మెట్ల గోపీ, జేసీఎస్ ఇన్‌చార్జి మతీన్‌ఖాన్, కమిషనర్ మహేంద్ర పాల్గొన్నారు.

పెదప్రోలులో..

పెదప్రోలు(మోపిదేవి): పెదప్రోలు సచివాలయం వద్ద సర్పంచ్ పాలిమెట్ల ఏసుబాబు అధ్యక్షతన బుధవారం జగనన్న సురక్ష శిబిరం నిర్వహించారు. అవనిగడ్డ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు ముఖ్య అతిథిగా పాల్గొని 528 మంది లబ్ధిదారులకు సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ అన్నివర్గాల ప్రజలకు మేలు చేసేలా జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహిస్తున్నామని చెప్పారు. ఈ శిబిరాల ద్వారా వివిధ సర్టిఫికెట్లను ఉచితంగా అందజేస్తున్నామని వివరించారు. ఎంపీటీసీ మద్దాల శ్రావణి, పీఏసీఎస్ చైర్‌పర్సన్ ఆదిరాంబాబు, ఎంపీడీఓ రామలింగేశ్వరరావు, తహసీల్దార్ కె. నవీన్‌కుమార్, ఈఓపీఆర్డీ అరుణకుమారి, గ్రామ కన్వీనర్ జన్యావుల రామమోహనరావు, గ్రామ కార్యదర్శి త్రిపుర సుందరి పాల్గొన్నారు.

సామాన్యుల మేలు కోసమే..

తలగడదీవి(నాగాయలంక): మండలంలోని తలగడదీవి, కమ్మనమోలు సచివాలయాల పరిధిలో బుధవారం జగనన్న సురక్ష శిబిరాలు నిర్వహించారు. నాగాయలంక ఎంపీపీ భోగాది రాఘవరాణి, జెడ్పీటీసీ సభ్యుడు మోకా బుచ్చిబాబు మాట్లాడారు. తలగడదీవిలో 335 సర్టిఫికెట్లు, కమ్మనమోలులో 140 సర్టిఫికెట్లు అందజేశారు. సర్పంచ్‌లు భోగాది వెంకటేశ్వరరావు, సనకా మురళీకృష్ణ, రాష్ట్ర కాపు కార్పొరేషన్ డైరెక్టర్ మద్ది వెంకట నారాయణ (చిన్నారి), మండల అధ్యక్షుడు భోగాది శేషగిరిరావు, అధికారులు పాల్గొన్నారు.

బంటుమిల్లిలో..

బంటుమిల్లి: బంటుమిల్లి, మణిమేశ్వరం గ్రామంలో బుధవారం తహసీల్దార్ సత్యనారాయణమూర్తి, ఎంపీడీఓ జె. స్వర్ణభారతి పర్యవేక్షణలో శిబిరాలు నిర్వహించారు. బంటుమిల్లిలో 247, మణిమేశ్వరంలో 238 సర్టిఫికెట్లను అందజేశారు.ఎంపీపీ వి. చినబాబు, జెడ్పీటీసీ ఎం. వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

సకాలంలో రుణాలు అందించాలి

చిలకలపూడి(మచిలీపట్నం): రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న వివిధ సంక్షేమ పథకాల ద్వారా ఎస్సీ, ఎస్టీ, బలహీనవర్గాల లబ్ధిదారులకు సకాలంలో రుణాలు అందించాలని కలెక్టర్ పి. రాజాబాబు బ్యాంకర్లకు సూచించారు. కలెక్టరేట్‌లోని సమావేశపు హాల్‌లో బుధవారం వివిధ బ్యాంక్‌ల అధికారులతో సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ పరిశ్రమల ఏర్పాటు కోసం 82 దరఖాస్తులు వచ్చాయని, వీరికి నిబంధనలు సడలిస్తూ రుణాలు అందించి ప్రోత్సహించాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మంజూరు చేసిన టిడ్కో గృహాలు పేదలకు అందించేందుకు లబ్ధిదారులకు ఆర్థిక స్థితిగతులను దృష్టిలో ఉంచుకుని రూ. 50 వేల నుంచి రూ. లక్ష వరకు రుణాలు అందించాలని చెప్పారు. మచిలీపట్నంలో మత్స్యకారులకు ఈ ఏడాది ప్రణాళికాబద్ధంగా రుణాలు అందించాలన్నారు. పామర్రు ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్ మాట్లాడుతూ కౌలు రైతులకు రుణాలు అందించడంతో పాటు పేద ప్రజలకు ముద్ర రుణాలు ఇవ్వాలన్నారు. ఆర్బీఐ ఏజీఎం ఎంజెడ్ రహమాన్, పలు బ్యాంకుల మేనేజర్లు పాల్గొన్నారు.

డ్వాక్రా మహిళల సమావేశం

నాగాయలంక: ప్రధానమంత్రి మైక్రో ఫుడ్ ప్రాసెస్ ఎంటర్ ప్రైజెస్ ద్వారా 35 శాతం సబ్సిడీతో ఫుడ్ ప్రాసెస్ మిషనరీ అందిస్తామని కృష్ణా జిల్లా ఈడీ జి.విజయలక్ష్మి అన్నారు. స్థానిక స్త్రీశక్తి భవనంలో బుధవారం డ్వాక్రా మహిళలతో సమావేశం జరిగింది. ఆమె మాట్లాడుతూ ఈ అవకాశాన్ని డ్వాక్రా మహిళలు వినియోగించుకుని లబ్ధి పొందాలని సూచించారు. యూనియన్ బ్యాంకు మేనేజర్ రవి కుమార్, సీసీలు, ఎంఎస్ సభ్యులు పాల్గొన్నారు.

నోట్ పుస్తకాల పంపిణీ అభినందనీయం

పెడన: ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు నోట్ పుస్తకాలు పంపిణీ చేయడం అభినందనీయమని జిల్లా రెవెన్యూ అధికారి ఎం. వెంకటేశ్వర్లు అన్నారు. స్థానిక ఫంక్షన్ హాల్‌లో తోటమూలలోని జెడ్పీహెచ్ఎస్ విద్యార్థులకు విజయవాణి సేఫ్టీ ఇంజినీరింగ్ కళాశాల చైర్మన్ గాజుల సాంబయ్య నాయుడు సహాయ ఫౌండేషన్ ద్వారా అందించిన నోటు పుస్తకాలను బుధవారం డీఆర్వో పంపిణీ చేశారు. డీఈఓ తాహెరా సుల్తానా మాట్లాడుతూ పెడన నియోజకవర్గంలోని 259 ప్రభుత్వ పాఠశాలల్లో ఒక్కో విద్యార్థికి 8 నోట్ పుస్తకాల చొప్పున ఇచ్చేందుకు సాంబయ్య నాయుడు ముందుకు రావడం అభినందనీయమన్నారు.

వెంకన్న పవిత్రోత్సవాలు ప్రారంభం

మచిలీపట్నంటౌన్: బచ్చుపేటలోని భూ సమేత వేంకటేశ్వరస్వామి వారి దేవస్థానంలో స్వామి వారి వార్షిక పవిత్రోత్సవాలు బుధవారం ప్రారంభమయ్యాయి. దశమి సందర్భంగా ప్రార్థనా సూక్త పఠనం, విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం, అఖండ దీపారాధన, ఆచార్యాది, ఋత్విగ్వరణం, వాస్తుపూజ, వాస్తుహోమం, అంకురారోపణం తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. ఆలయ కార్యనిర్వహణాధికారి చక్రధరరావు, ఆలయ ఫౌండర్ చైర్మన్ ముత్తేవి రవికాంత్ పర్యవేక్షించారు.

ఆశీల వసూళ్లకు వేలం

పెడన: పట్టణంలో మత్స్యమాంసాదుల మార్కెట్, వారపు సంత, పండ్లు, పూలు, కూరగాయల మార్కెట్‌లో రోజువారీ రుసుం వసూలు చేసుకునే హక్కుకు కోర్టు ఆదేశాలతో బహిరంగ వేలం బుధవారం జరిగింది. మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ కమిషనర్ బి. మహేంద్ర నేతృత్వంలో జరిగిన వేలంలో రౌతుల ప్రసాద్ హెచ్చు పాట పాడారు. 2024 మార్చి 31వ తేదీ వరకు 8 నెలల 18 రోజులకు రూ.13,22,780లు జీఎస్టీతో కలిపి రౌతుల ప్రసాద్ అత్యధిక ధరకు కోడ్ చేసి పాడుకున్నారని కమిషనర్ మహేంద్ర తెలిపారు.

వివాహితపై దాడి

పెడన: మండలంలోని ఉరివి గ్రామానికి చెందిన చిన్నం గంగలక్ష్మిపై దాడి చేసిన ఘటన పెడన పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పెడన పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఈ నెల 9న ఇంటి వద్ద ఉన్న గంగలక్ష్మిపై చిన్న సిద్ధార్థ, నిర్మల, పృథ్వీలు దాడి చేసి గాయపరిచారు. బాధితురాలిని బంధువులు మచిలీపట్నం ఆస్పత్రిలో చికిత్స నిమిత్తం చేర్పించారు. అవుట్ పోలీసుల సమాచారం మేరకు కేసు నమోదు చేశారు.

నేడు మండల పరిషత్ సమావేశం

కృత్తివెన్ను: మండల పరిషత్ సర్వసభ్య సమావేశం గురువారం మధ్యాహ్నం రెండు గంటలకు స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశపు మందిరంలో నిర్వహిస్తామని కృత్తివెన్ను ఎంపీడీఓ పిచ్చిబాబు తెలిపారు. మండల స్థాయి అధికారులు, ప్రజాప్రతినిధులు హాజరుకావాలని కోరారు.

డిజిటల్ విద్యపై పట్టుతో సులభంగా బోధన

పెడన: డిజిటల్ విద్యపై పట్టు సాధిస్తే విద్యార్థులకు అర్థమయ్యేలా సులభంగా బోధించవచ్చునని జిల్లా విద్యాశాఖాధికారి తాహెరా సుల్తానా అన్నారు. నందమూరు శ్రీవాసవి ఇంజినీరింగ్ కళాశాలలో ఉపాధ్యాయులకు డిజిటల్ విద్యపై నిర్వహిస్తున్న శిక్షణ తరగతులను బుధవారం ఆమె పరిశీలించి మాట్లాడారు. ఉపాధ్యాయులు ఎంత బాగా ఆయా సబ్జెక్టులను అర్థం చేసుకుంటారో అంత బాగా విద్యార్థులకు బోధించేందుకు అవకాశం ఉంటుందని చెప్పారు. మచిలీపట్నం డీవైఈఓ సుబ్బారావు, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బీఆర్ శ్రీనివాస్‌రెడ్డి, కరస్పాండెంట్ కుమార్‌బాబు, హెచ్ఓడీ ఎస్‌వీసీ గుప్తా తదితరులు పాల్గొన్నారు.

రెండు ద్విచక్ర వాహనాలు చోరీ

పెడన: వేర్వేరు ప్రాంతాల్లో ద్విచక్ర వాహనాలు చోరీకి గురయ్యాయి. పెడన పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పెడన మండలం నందమూరు గ్రామానికి చెందిన బి. శామ్యూల్ ఈ ఏడాది మే 26న మండల పరిధిలోని నందిగామ గ్రామంలో స్నేహితుని వివాహానికి వెళ్లాడు. స్నేహితుని ఇంటి వద్ద ద్విచక్ర వాహనాన్ని పార్కింగ్ చేశారు. వివాహానికి వెళ్లి తిరిగి వచ్చి చూస్తే వాహనం కనిపించలేదు. అప్పటి నుంచి వెతికినా ఫలితం లేకపోవడంతో బుధవారం పెడన పోలీసులకు ఫిర్యాదు చేశారు. విజయవాడ రామవరప్పాడుకు చెందిన లంకా శివకుమార్ ఈ నెల 3వ తేదీన వ్యక్తిగత పనుల నిమిత్తం పెడన వచ్చి బస్టాండ్ వద్ద పార్కింగ్ చేశాడు. రెండు గంటల తరువాత వచ్చి చూస్తే వాహనం కనిపించలేదు. తెలిసిన వారి వద్ద విచారణ చేసినా ఫలితం లేదు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

వ్యక్తిగత పరిశుభ్రత అవసరం

కోనేరుసెంటర్: విద్యార్థులు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని చిన్నాపురం పీహెచ్‌సీ వైద్యుడు రాజీవ్‌రావు అన్నారు. ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంలో భాగంగా బందరు మండలం రుద్రవరంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలను వైద్య బృందం బుధవారం సందర్శించారు. వంటశాల, మరుగుదొడ్లు, వాటర్‌ట్యాంకులను పరిశీలించి పలు సూచనలు చేశారు. అనంతరం విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు చేశారు. ప్రిన్సిపాల్ ఎం. అనిల్‌కుమార్, ఎంపీహెచ్ఈఓ పరమేశ్వరరావు పాల్గొన్నారు.

ధ్రువీకరణ పత్రాల పంపిణీ

చల్లపల్లి: జగనన్న సురక్ష కార్యక్రమం పేదలకు ఎంతో ప్రయోజనకరమని తహసీల్దార్ కె.గోపాలకృష్ణ అన్నారు. బుధవారం స్థానిక పంచాయతీ ఆవరణలో జగనన్న సురక్ష శిబిరం నిర్వహించారు. 524 సర్టిఫికెట్ల లబ్ధిదారులకు తహసీల్దార్ పంపిణీ చేశారు. సర్పంచ్ పైడిపాముల కృష్ణకుమారి, పీఏసీఎస్ చైర్మన్ పాగోలు నాగసీతారామారావు (ఫణి), ఈఓఆర్డీ బూరేపల్లి అశోక్, నాయకులు పాల్గొన్నారు.